క్లుప్తంగా

వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి



చదలవాడలో గొర్రెలకు టీకాలు వేస్తున్న జేడీ బేబిరాణి

నాగులుప్పలపాడు: గొర్రెలు, మేకలు వంటి జీవాల్లో సాధారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ జేడీ బేబిరాణి అన్నారు. జిల్లా వ్యాప్తంగా జీవాలకు వేసే టీకా కార్యక్రమంలో గురువారం మండలంలోని చదలవాడ గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమం పరిశీలించిన జేడీ బేబిరాణి మాట్లాడారు. గొర్రెల్లో సీజనల్‌గా వచ్చే నీలి నాలుక వ్యాధితో పాటు ఇతర రోగాలకు టీకాలు వేయించడంతో పాటు నట్టల నివారణ మందులు వాడాలని తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం



విద్యార్థులను సత్కరిస్తున్న కొంజేటి సురేష్, గ్రామస్తులు

నాగులుప్పలపాడు: ప్రతిభ కనబరచే విద్యార్థులను ప్రోత్సహించడానికి వాసవి క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్ అన్నారు. ఇటీవల ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన విద్యార్థులు పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడంతో ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయంలో గురువారం సత్కారం ఏర్పాటు చేశారు. పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించిన జ్లెస్సీ జాయ్, ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన హేమలతతో పాటు ఎంసెట్‌లో స్టేట్ 402 ర్యాంకు సాధించిన గాదంశెట్టి సంకల్పను కొంజేటి సురేష్‌తో పాటు సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్‌తో పాటు గ్రామస్తులు అభినందించి సత్కరించారు. గ్రంథపాలకులు ప్రసాద్, శ్రీనువాసరావు, అచ్చుబ్బాయి, తదితరులున్నారు.

వసతి గృహాల వద్ద ముళ్ల కంప తొలగింపు



శుభ్రం చేస్తున్న పొక్లెయిన్

ఒంగోలు సెంట్రల్: సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం-1, 2లో ఉన్న ముళ్ల పొదల తొలగింపునకు గురువారం శ్రీకారం చుట్టారు. ఆయా వసతి గృహాలను బుధవారం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పరిశీలించారు. గురువారం మున్సిపల్ శాఖ అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసి పనులు మొదలు పెట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎస్. లక్ష్మా నాయక్ తెలిపారు. మంత్రికి డోలాకు.. నాయక్‌తో పాటు ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు స్వప్న లత, శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

నీట్ పరీక్ష పేపర్ లీక్ దుర్మార్గం



కొత్తపట్నం హైస్కూల్‌ను మూసి వేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తపట్నం: నీట్ పరీక్ష పేపరు లీక్ చేయడం దుర్మార్గ చర్యని మాజీ ఎస్ఎఫ్ నాయకుడు ఎస్. స్వామి రెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ కారణంగా గురువారం కొత్తపట్నం మండలంలో ఉన్న పాఠశాలల విద్యాసంస్థలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పరీక్ష పేపర్లు లీకు అయ్యాయని.. దేశానికి డాక్టర్లను అందించే నీట్ పరీక్ష అమ్మకం, కొనుగోళ్లు జరగడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ నాయకులు పి.సోమరాజు, పి.శ్రీను, కె.శ్రీను, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

గిద్దలూరు రూరల్: నీట్ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపడుతూ పట్టణంలోని పలు విద్యా సంస్థలను గురువారం మూత వేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు నీట్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూతేయించారు. ప్రభుత్వ పాఠశాలలు మూతవేయలేదని తెలుసుకున్న విద్యార్థి సంఘ నాయకులు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్దకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

మిడ్ డే మీల్స్ నిర్వాహకులను కొనసాగించాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అంజేసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్



మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ పారిశుద్ధ్య కార్మికులను తొలగింపులను ఆపాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కల్పన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారీని కలిసి వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెడుతున్నారని, మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోయినా, వేతనాలు, బిల్లులు సరిగా రాకపోయినా ఆర్థికంగా పెనుభారమైన అప్పులు చేసి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, పని మానుకుంటున్నట్లు లెటర్లు రాసి సంతకాలు చేయాలని జిల్లాలోని హెచ్ఎంపాడు, కొత్తపట్నం, తర్లుపాడు, మార్కాపురం, గిద్దలూరు మండలంలోని సంజీరావుపేట హైస్కూలు, ఎంపీపీ స్కూలు, ముళ్లపాడు హైస్కూలు, ఉయ్యాలవాడ హైస్కూలు పారిశుద్ధ్య కార్మికులు, గంజి వీరయ్య మెమోరియల్ స్కూల్, కంభం జెడ్పీ హైస్కూలు, పెద నల్లకాల్వ హైస్కూలు హెడ్ మాస్టర్ల ద్వారా ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన చెందారు. తమని ఎందుకు తొలగిస్తున్నారో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరితే పట్టించుకోవడం లేదని తెలిపారు. పనిమానివేయకుంటే సామాగ్రి బయట పడేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల నుంచి తొలగించే విషయంపై గతంలో కోర్టుకు వెళ్లగా కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా జీఓ నెంబర్ 94 ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులను, స్కూలు పారిశుద్ధ్య కార్మికులను తొలగించకుండా కలెక్టర్ జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈశ్వరమ్మ, అక్కమ్మ, చెన్నమ్మ, చెన్నలక్ష్మి, లక్ష్మీ నరసమ్మ, సామ్రాజ్యం, సుబ్బలక్ష్మమ్మ, ఏడుకొండమ్మ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సాయుధ పోరాటం నమ్మిన అల్లూరి



జిల్లా గ్రంథాలయంలో అల్లూరి జయంతి, పింగళి వెంకయ్య వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



యూనివర్సిటీలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, సిబ్బంది



కొత్తపట్నంలో సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు టౌన్: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి చివరిదాకా పోరాడిన వీరుడు అల్లూరి సీతారామరాజును భవిష్యత్తరాలు ఎన్నటికీ మరచిపోవని గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. మన్యం వీరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ జాతీయోద్యమంలో మన్యం పోరాటం ఆలోచనను రేకెత్తించిందని, దేశంలోని అనేక ప్రాంతాల్లో బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలకు ప్రేరణ ఇచ్చిందని చెప్పారు. గిరిజనుల సహకారంతో విల్లంబులు చేత పట్టుకుని తెల్ల ముష్కరులకు చెమటలు పట్టించిన సీతారామరాజు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనన్నారు.

జెండాలా ఎగురుతున్న పింగళి చరిత్ర

జాతీయ పతాకం రూపకర్త పంగళి వెంకయ్య వర్ధంతి పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పించారు. 19 సంవత్సరాల వయసులో ఇండియన్ ఆర్మీలో చేరిన వెంకయ్య దేశ ప్రజల సమైక్యత, సామరస్యత ప్రతిబింబించేలా త్రివర్ణ పతాకాన్ని రూపొందించారని విశ్రాంత సబ్ కలెక్టర్ పి. పేరయ్య చెప్పారు. దేశంలో జాతీయ జెండా రెపరెపలాడేంత వరకు వెంకయ్యను ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగేష్, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు, బీడీసీయల్ నిర్వాహకులు సుబ్బారావు, సంపూర్ణమ్మ, అనిల్ కుమార్, టి. కృష్ణవేణి, శాంసన్, సందీప్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

ఒంగోలు సెంట్రల్: బ్రిటీష్ పాలకులను ఎదిరించి స్వరాజ్య స్థాపన కోసం అశువులు బాసిన మన్యం వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు అన్నారు. 126వ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ రామోహన్ రావు ఆధ్వర్యంలో నివాళులర్పించి అల్లూరి త్యాగ నిరతిని కొనియాడారు. అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏకేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ జి. సోమశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి, యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ కేవీ క్రిష్ణారావు, సహాయక ఆచార్యులు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, డాక్టర్ పి. వెంకట్రావు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరి

కొత్తపట్నం: అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు ఆశయాలను కొనసాగించాలని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్వీ రమేష్ బాబు అన్నారు. స్థానిక పాఠశాలలో అల్లూరి సీతరామరాజు 127వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు గీసిన అల్లూరి సీతరామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పర్రె వెంకట్రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విశాఖ జిల్లా, పాండ్రం గ్రామంలో 1897లో వెంకటరామరాజు, నారాయణమ్మలకు జన్మించారన్నారు. సైన్సు ఉపాధ్యాయుడు కె.వి శేషారావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశభక్తి నాయకుల ద్వారా కథలు, జ్ఞానం పొందాలన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సీతారామరాజు జీవిత చరిత్ర, ఆయన చేసి సేవలు గురించి వివరించారు. అల్లూరి సీతారామరాజుకు విలువిద్య, గుర్రపు స్వారి, యోగా వంటి నైపుణ్యాలు ప్రదర్శించేవారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆటల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు కోటేశ్వరరావు టీషర్టులు బహూకరించారు. ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, పాఠశాల సెక్రటరీ హరిబాబు, కె.ధనలక్ష్మీ, నిర్మల, ఉమమహేశ్వరరావు, రాజ్యలక్ష్మి, పీడీ ఫైయాజ్, కృష్ణమూర్తి, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

నీట్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించండి



ఒంగోలులో బంద్ నిర్వహిస్తున్న విద్యార్థులు



చీమకుర్తి బంద్‌లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: నీట్ పరీక్ష పేపర్లను లీకేజీ చేసి లక్షలాది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకున్న దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వమించిన బంద్‌లో భాగంగా ఒంగోలులో విద్యాసంస్థలను బంద్ చేశారు. పీవీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న బీజేపీకి ఏమాత్రం సిగ్గున్నా వెంటనే దోషులపై చర్యలు తీసుకునేదని మండిపడ్డారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందిన ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని, నీట్ పరీక్షల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ పరీక్షల నిర్వహించడానికి అర్హత కోల్పోయిందని, పరీక్ష పత్రాలను లీకేజీ చేస్తూ కోట్ల రుపాయలను అర్జిస్తుందని, ఈ దుర్మార్గాన్ని ఎన్డీఏ ప్రభుత్వం సమర్థించడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ విమర్శించారు. పేదలకు ఉన్నత విద్య అందకుండా చేయడానికే బీజేపీ ప్రభుత్వం పేపర్ లీకేజీలకు పాల్పడుతుందని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్యామ్ ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ బంద్

చీమకుర్తి: ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు గురువారం చీమకుర్తిలో పాఠశాలలను మూసేస్తూ బంద్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హైస్కూలు నుంచి విద్యార్థులు ర్యాలీగా మెయిన్ రోడ్డుపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను నిర్వహించటంలో పేపర్ లీకేజీ కారణంగా ప్రతిభ కలిగిన విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీశారని ఎండగట్టారు. ఈ పోరాటం ఇంతటితో ఆగకుండా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమాల్లో పాఠశాలల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మహ్మద్ ఫరూక్

ముండ్లమూరు: రైతులు సాగుకు ముందుగా విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి మహ్మద్ ఫరూక్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం విత్తనోత్పత్తి, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో ప్రభుత్వమే 30 మంది రైతులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. . వీఏఏలు శోభారాణి, నిర్మల, బాల వెంకటయ్య, ఎంపీఈఓ రజాక్, రైతులు పాల్గొన్నారు.

హమాలీ మృతి

దొనకొండ: స్థానిక ఫౌర సరఫరాల గిడ్డంగి హమాలిగా పని చేస్తున్న పొన్నెబోయిన చిన్నగురవయ్య (36) అనారోగ్యంతో గురువారం తెల్లవారు జామున మరణించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గురవయ్యకు మట్టి ఖర్చుల కోసం రూ.20 వేల నగదును హమాలీ మేస్త్రీ గుడిమెట్ల ఆదాం ద్వారా గురవయ్య భార్యకు అందజేశారు. యూనియన్ తరపున రూ.10 వేల నగదు అందజేశారు.

పంచాయతీలో జీతాలెక్కడ?

మద్దిపాడు: మండల పరిధిలోని దొడ్డవరం గ్రామ పంచాయతీ పరిధిలో క్లాప్ మిత్రలకు, పంచాయతీ వర్కర్లకు 4 నెలల జీతాలు ఇవ్వలేదని పారిశుద్ధ్య కార్మికులు ఫిర్యాదు చేశారు. గురువారం వారంతా మండల ఈఓపీఆర్‌డీ వద్దకు వచ్చి తమ ఇల్లు గడవడం లేదని నాలుగు నెలలుగా తమకు జీతాలు పెట్టలేదని మొరపెట్టుకున్నారు. దీనిపై ఈఓపీఆర్‌డీ రఘుబాబు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి లతీఫ్‌ను ప్రశ్నించగా ఆయన సర్పంచ్ సంతకం చేయడం లేదనంటూ చెప్పడంతో సర్పంచ్ సుబ్బారావును పిలిపించి ప్రశ్నించారు. సర్పంచ్.. సురేష్ అనే వ్యక్తిని ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్ వద్ద ఉద్యోగం పెట్టగా అతను విధులు నిర్వహించడం లేదని అందులన జీతాలు పెట్టడం లేదని వివరించారు. సదరు సురేష్‌ను పక్కన ఉంచి అయినా మిగిలిన వారికి జీతాలు ఇవ్వాలని కార్మికులు కోరగా పంచాయతీ జనరల్ ఫండ్‌లో ఉన్న డబ్బు రెండు నెలలకు సరిపోతుందని, అందుకే రెండునెలల జీతాలు వేయించడానికి గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శికి ఆదేశాలు ఇస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని ముటుకుల పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి అన్నారు. గురువారం ముటుకుల గ్రామస్తులు ఉప్పాళ్ల చిన్నకొండలు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 200 మంది విద్యార్థులకు దాదాపు రూ.15 వేల విలువైన జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కొండలును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దాత కొండలు మాట్లాడుతూ తన ఇద్దరు పిల్లలు ఐఐటీ చదువుతున్నారని, విద్యార్థులకు తన వంతు సాయంగా ఏదో చేయాలని తపన ఉండేదని తెలిపారు. కొండలును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



జామెంట్రీ బాక్సులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, దాత కొండలు

వంగవీటికి ఘన నివాళి



వంటివీటికి నివాళులర్పిస్తున్న సంఘు బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తుది వరకు పోరాడిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా అని వక్తలు కొనియాడారు. ఆలిండియా కాపు ఫెడరేషన్, కాపు కమ్యూనిటీ హాల్ సంయుక్త ఆధ్వర్యంలో కాపు కళ్యాణ మండపం వద్ద రంగా 77వ జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గొర్రెపాటి అర్జున రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా ఆయుధంగా ఉంటూ వారి అభ్యున్నతి కోసం పోరాడుతూ అశువులు బాసిన మహోన్నతుడు వంగవీటి మోహన రంగా అని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ ప్రెసిడెంట్ తోటపల్లి రంగరావు, కళ్యాణ మండపం ప్రెసిడెంట్ నాగిశెట్టి బ్రహ్మయ్య, చలమయ్య, రాధాక్రిష్ణ, కందుకూరి సాయి, ఆకుల శ్రీను, కోటేశ్వరరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

చీమకుర్తి: గ్రామాల వారీగా ప్రజలకు అవసరమైన తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధికారులకు సూచించారు. గురువారం చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా ప్రగతి నివేదికలను పర్యవేక్షించారు. కేవీ పాలెం ఎంపీటీసీ వేమా అశ్విని మాట్లాడుతూ సాగర్ జలాలతో గ్రామంలోని చెరువును నింపి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాఘవేంద్ర, పలు గ్రామాల నుంచి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో మరకత శివలింగం



మహానందీశ్వర పూజలో అర్చకులు భక్తులు

ఒంగోలు మెట్రో: జేష్ఠ మాసం బహుళ చతుర్దశి గురువారం మాస శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాల్లో ప్రదోషకాలను భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామి పేట కాశీ విశ్వనాథుని దేవస్థానంలో, లాయర్ పేట షిరిడి సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగాంతో పాటు పలు చోట్ల పూజలు జరిగాయి. మహానందిశ్వరుడికి హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీనియర్ కమ్యూనిస్టు నల్లూరి రాఘవస్వామి మృతి



నల్లూరి రాఘవస్వామికి నివాళులర్పిస్తున్న నేతలు

ఒంగోలు టౌన్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు నల్లూరి రాఘవస్వామి (80) గురువారం తెలవారుజామున మరణించారు. మద్దిపాడు మండలం పెద కొత్తపల్లి శివారు నరసాయపాలెం గ్రామానికి చెందిన ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆయన పార్టీ కార్యక్రమాలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేవారు. నిరుపేదలకు అండదండులు అందించేవారు. నల్లూరి అంజయ్య మీద ఉన్న అభిమానంతో అంజయ్య నగర్ బస్టాండు వద్ద గేటు నిర్మించారు. నల్లూరి మరణవార్త తెలిసిన అనేక మంది పార్టీ నాయకులు నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, కమ్యూనిజం మాస పత్రిక పూర్వ సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు, ఒంగోలు నగర సీపీఐ కార్యదర్శి పీవీఆర్ చౌదరి, సీనియర్ నాయకులు ప్రకాశరావు, అడ్వకేటు పోతినేని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్, నలజర్ల శ్రీను, గోగినేని రావు, నల్లూరి మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు.

భోలే బాబాను అరెస్ట్ చేయాలి

ఒంగోలు టౌన్: హత్రాస్‌లో 120 మంది మృతికి కారణమైన భోలే బాబాను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక, జన సాహితి జిల్లా నాయకులు మండ్లా శ్రీనివాసులు, సి.హెచ్ జయప్రకాష్, డా. జి.వి కృష్ణయ్య ఓ ప్రకటనల్లో డిమాండ్ చేశారు. తన పాదధూళి మహిమకలదని మోసపూరిత ప్రచారం చేయడం వల్లనే ప్రజలు పెద్ద సంఖ్యలో చేరారని, సరైన సౌకర్యాలను కల్పించక పోవడంతో ప్రజలు ఊపిరాడక మరణించారని వివరించారు. దేశంలో ఈ తరహా ఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక దోపిడీకి పాల్పడుతున్న దొంగబాబాలను రక్షించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీదనే ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ హెచ్ ప్రకారం తగిన కార్యచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

వీఎల్ఓలకు గజిటెడ్ హోదా కల్పించాలి



మంత్రి డోలాకు సమస్యలు వివరిస్తున్న రమేష్ బాబు, సంఘు బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న వీఎల్ఓలకు గజిటెడ్ హోదా కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవలని ఆంధ్ర ప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ (ఏపీఎన్‌జీవిఎఫ్) చైర్మన్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం సాంఘిక శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి విన్నవించారు. తమ సమస్యలను పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చం నాయుడికి వివరించి తగిన న్యాయం చేయాలని కోరారు. సంఘ చైర్మన్ రమేష్‌బాబు, కార్యదర్శి ఎం. కోటేశ్వర రావు, ట్రెజరర్ ప్రభావత, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీ ఎం. ప్రభాకర్, వాసు, ఎల్ఎస్ఏ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి చంద్ర, వీఏ అసోషియేషన్ బాధ్యులు శంకరరావు, వైస్ ప్రెసిడెంట్ స్వాతి, భవాని, సెక్రటరీ చరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ వెంకట రావు, ట్రెజరర్ శ్యామల కుమారి, సభ్యులు పాల్గొన్నారు.